# పప్పులో కాలు

*-కె.కె. రఘునందన*

అతని అసలు పేరేమిటో అందరూ మరిచిపోయారు. అతను కూడా మరచిపోయాడేమో బహుశా... ఎందుకంటే నలుగురు పిలిచే 'ఈ పేరు'తో నయితే ఎంచక్కా పలుకుతున్నాడు మరి. ఆ నామధేయం ఎలా సంక్రమించిందంటే చిలకలూరిపేటలో మరిడమ్మ ఉత్సవాలు చేస్తూ పరిషత్ పోటీలు కూడా పెట్టారు.

ఆ పోటీల్లో 'పప్పులో కాలు' నాటిక ప్రదర్శించారు. అది నూటికి నూరుపాళ్ళు హాస్యం పండించిన నాటిక. అందులో హైలెట్ క్యారెక్టర్ 'కొజ్జా కనకరాజు' పాత్ర. నిజంగా ఆడంగివాడా యితగాడు అని దిమ్మెరపోయారంతా..అది మొదలు 'కొజ్జా కనకరాజు'గా కీర్తించటం మొదలెట్టారు.

అయితే వచ్చిన చిక్కేమిటంటే భార్య మాత్రం ఏరోజుకారోజు కనకరాజు (అసలు పేరు మనమూ మరిచిపోదాం)ను ఏకసాగింది. "ఏమండీ! మా అత్తమామలు నిక్షేపంలాంటి పేరు పెడితే ఈ దిక్కుమాలిన పేరేమిటండీ... ఆ వెధవ చూపులు చూస్తుంటాడే ఆ'విరహాల రావు' ఏమన్నాడో తెలుసా 'కొజ్జా కనకరాజుగారున్నారా?' అన్నాడు. నాకెంత మండిపోయిందో...!! నిన్నగాక మొన్న మనం బజారు వెళుతుంటే ఆ సన్యాసిరావు మిమ్మల్ని అసలు పేరు మాని ఈ పేరుతో పిలిస్తే చంకలు గుద్దుకుని మరీ చటుక్కున తిరిగారు. అది మంటల్లో మహా మంటగా అనిపించింది. అందువల్ల ఇక నుండీ మిమ్మల్ని ఆ పేరుతో ఎవరైనా పిలిచారో మీ దారి మీది నా దారి నాది..."

ఆ మాటకి దంగైపోయాడు కనకరాజు.

నిజానికి ఇదివరలో ఎన్నో పాత్రల్లో జీవించటానికి నానా పీకులాటలూ పడ్డాడు. కాని 'పప్పులో కాలు' నాటికలో ఏమాత్రం నటించకుండానే జీవించినట్లు ముద్ర పడేశారు. చూసిన ప్రతివాడు 'భేష్ భేష్' అన్నాడు.

వచ్చిన చిక్కల్లా తను ఆ నాటికను ప్రదర్శించవలసి వచ్చినప్పుడల్లా మూతిమీద మీసం గొరుక్కోవలసి వచ్చేది. మహరాజు లాంటి మీసం అదృశ్యమైన క్షణం మాత్రం భార్య గోమతి చేత చీవాట్లు తినాల్సి వచ్చేది.

"పేడివాడ్లా ఏమిటండీ... నా పరువు తీస్తున్నారు. ఛఛ! ఎవడండీ ఆ దిక్కుమాలిన రచయిత. ఎందుకండీ ఈ పాత్ర సృష్టించాడు." అని తన కోపమంతా రచయితపైన కుమ్మరించేది. అంత మాటనకు గోమతీ... కుక్కుటేశ్వరరావు... ఈ మధ్యనే నాటకాలు రాయటం ప్రారంభించాడు. అతని అద్భుత సృష్టి ఈ పాత్ర'' అని సమర్థించేవాడు కనకరాజు.

"నా పిండాకూడు కాదూ! అయినా ఆ పాత్ర మీరు వేసేదేమిటి! వేరే ఎవరైనా వేయొచ్చుకదా!!"

"అలా వేరెవరో వేస్తే నాకెలా పేరొస్తుంది..."

"కాదు... అందరూ మిమ్మల్ని భభ్రాజమానాన్ని చేసి మీకాపాత్ర అంటగట్టారు" అని అక్కసు వెళ్ళగక్కింది గోమతి.

ఈ ప్రస్తావన ఎప్పుడు వచ్చినా రణరంగం సాగేది ఇద్దరి మధ్య.

ఇదిలా ఉండగా రాక రాక వచ్చింది గోమతి మిత్రురాలు గాయత్రి.

"గాయత్రీ ఏమిటే ఇంతకాలం నల్లపూసవై పోయావా!!" బడబడా పలకరించేసింది గోమతి.

పసితనపు ఆటల నుండి... ఇప్పటి సంసారాల దాకా కబుర్లు దొర్లాయి. భర్తలు ఇష్టారాజ్యంగా వ్యవహరించటం గురించి ఉపన్యాసాలే దంచుకున్నారు.

సరిగ్గా ఆ సమయంలోనే కనకరాజు ప్రవేశించాడు.

"ఈయన మా ఆయన..." పరిచయం చేసింది గోమతి.

అతనివైపు చూసిన గాయత్రి జంతికలు కరకర నములుతున్నదల్లా ఆపి, విభ్రమంగా చూస్తూ

"ఈయన మీ ఆయనా? ఈజిట్?" ప్రశ్నించింది.

"ఏవేం! అంత ఆశ్చర్యం దేనికి... ఓహ్! నువ్వు పెళ్ళికి రాలేదు కదూ... నీ నివ్వెరపాటు మండినట్లే ఉందిగాని ఈయన మా ఆయనే..."

"యస్ బాగా గుర్తొచ్చింది... ఈయన్ని నేను లింగారావుపాలెం పరిషత్ నాటికల్లో చూశాను. అదే 'పప్పులో కాలు'లో... అందులో 'కొజ్జా కనకరాజు' పాత్రలో దంచేశారంటే నమ్ము" తెగ పొంగిపోయింది గాయత్రి.

ఆమె పొగడ్తలకి నవ్వాలో, భార్య కళ్ళెర్ర చేస్తూ చూసిన చూపులకి ఏడవాలో తెలీక నిర్ఘాంతపోయాడు.

స్నేహితురాలిని మరో విషయంలోకి దారి మళ్ళించాలని చేసిన ప్రయత్నం వృథా ప్రణాళికలానే మిగిలింది గోమతికి.

ఇంకొక్క క్షణం వ్యర్థం చేయకుండా అతనితో ఇంటర్వ్యూ ప్రారంభించింది గాయత్రి.

"మీరెంత కాలం నుండి నాటకాలు వేస్తున్నారు... అందులో మీకు నచ్చిన పాత్రేది?..."

"సుమారు పది సంవత్సరాలైంది... అందులో నాకు నచ్చిన పాత్ర... కొజ్జాపాత్ర..." భార్య దగ్గర బెదురుతూనే జవాబులిస్తున్నాడు కనకరాజు.

"ఇవన్నీ నీ కెందుకే..." అని మిత్రురాలిని తగ్గించటానికి శతథా ప్రయత్నించింది గోమతి.

అయినా లక్ష్యపెట్టక – "అసలు కళను మెచ్చుకోనివాడు, ప్రోత్సహించనివాడు దున్నపోతై పుడతారని ఏదో పుస్తకంలో చదివాను." అని తన ధోరణిలో తను తలమునకలైంది.

"నవ్వు నాలుగువిధాల చేటన్నది ఒకనాటి మాట... కాని ఈ కంప్యూటర్ యుగంలో నవ్వు నాలుగు విధాల మేలు అని శాస్త్రవేత్తలంటున్నారు. ఆ రోజు కొజ్జాపాత్రలో మీరు నటిస్తున్నారా? జీవిస్తున్నారా? అని ఎంత మొత్తుకున్నా అర్థం కాలేదు... ఎవరీయన ఇంత ఈజ్‌గా చేస్తున్నారు అనుకుని తెగ పొంగిపోయానంటే నమ్మండి" పొగడ్తల పోటీ పెడితే నెగ్గేలా వుంది గాయత్రి. అదే సందుగా చేసుకుని తనకి 'కొజ్జా' పాత్రకు వచ్చిన పరిషత్ ప్రైజ్‌లన్నీ ఆమె ముందర పరిచాడు కనకరాజు.

ఆ సన్నివేశం మరీ భరించలేకపోయింది గోమతి.

నాల్గు క్షణాల క్రితం దాకా ఏమాత్రం పరిచయం లేని ఇద్దరు... ఆఫ్టాల్ ఓ కొజ్జా క్యారక్టర్ మూలాన కలిసిపోవటమా... పైగా చర్చా? అవకాశం దొరికింది కదాని భుజాలు పొంగించుకుని బహుమతుల బహిరంగ ప్రదర్శనా? నాన్సెన్స్...!! ఇంకా కబుర్లు ఆగలేదు...

అంతే, ఒక్క గావుకేక పెట్టింది గోమతి.

హడలి చచ్చారిద్దరూ!!

"ఎందుకే ఆ అరుపు... ఏం నీ శ్రీవారికి పేరొస్తే నీకు పేరొచ్చినట్లు కాదా? చెప్పు! మీ శ్రీవారి కీర్తిని భరించలేవా ఏమిటి? అయినా అంత జెలసీ పనికిరాదే... ఎంత కష్టపడి మీవారు ఆ 'కొజ్జా' పాత్రలో జీవించారని... పదేపదే 'అదే' పదాన్ని ఉచ్ఛరించటంతో గోమతి రక్తం సలసల మరిగింది.

మిత్రురాళ్ళిద్దరూ వాదులాటలో ఉండగానే అక్కడ ప్రైజుల బజారు ఎత్తేస్కుని ఎంచక్కా వుడాయించాడు కనకరాజు.

గాయత్రి ప్రాణస్నేహితురాలైనప్పటికీ, అంతరాంతరాల్లో ఆమెపై కసి తెగ కార్చిచ్చులా వ్యాపించింది గోమతిలో...

ఆ కసితోటే కారంపాళ్ళు కాస్త అధికంగానే వేసింది గోమతి.

'ఏవిఁటే యింత కారం దంచేశావు...? గుంటూరు వాళ్ళలా... అన్నట్లు గుంటూరంటే గుర్తుకొచ్చింది. అక్కడ... 'బొప్పూడి'లో పరిషత్ పోటీలున్నాయని, మీ ఆయన ప్రదర్శించే 'పప్పులోకాలు' కూడా సెలక్టయిందని పేపర్లో చూశాను. మళ్ళీ అదేపాత్రలో అయితే... సూపర్. ఈసారి మీ ఆయనదే ఉ.హా.న."

"ఉ.హా.న.వా..."

"అదేనే... 'ఉత్తమ హాస్యనటుడు'... ఆ కొజ్జాపాత్ర ఎంతకాలం పోషిస్తే అంతకాలం మీ ఆయనే ఉ.హా.న."

డైనింగ్ టేబిల్ మీద చిన్నసైజు గంగాళంలో వేడి సాంబారు ఒక్కసారి గాయత్రి నెత్తిన వంపాలనిపించింది.

భోజనాలైనాయి. బెడ్రూంలోకి వెళ్ళారిద్దరూ...

"ఏవేం! మీ ఆయన పాత్రలోనే జీవిస్తున్నారా!

లేక నిజజీవితంలో కూడానా..." అని విరగబడి నవ్వసాగింది గాయత్రి.

ఒక్కసారి అమాంతం ఓ బండరాయిని ఆమె నెత్తినెత్తాలనిపించింది. ఎప్పటిలా అయితే గాయత్రి స్నేహం కోసం, ఆమె మాటల కోసం తహతహలాడిపోయేది గోమతి. కాని ఈసారి ఆమె రాక ప్రాణాంతకంగా మారింది. అదృష్టవశాత్తు తెల్లవారుతూనే భర్త నుండి ఫోన్ వచ్చింది అర్జంటుగా రమ్మని. అంతే గాయత్రి కదలక తప్పలేదు.

గుండె తెరిపిన పడ్డది గోమతికి.

మర్నాడుదయం ఎనిమిది గంటలకు గబగబ కూరల కెళ్ళి తిరిగివచ్చింది గోమతి.

అప్పటికే ఓ రిక్షావాడు ఇంటి ముందర తచ్చాడుతూ కనిపించాడు. వాడు పళ్ళికిలిస్తూ ఓ చీటీ అందించాడు. దాన్ని చూస్తూనే... పళ్ళు పటపటకొరికి కళ్ళెర్రచేసి చూసింది.

"హుం" అనేసి చీటీ వాడిచేతిలో కుక్కేసి అటువైపు పొమ్మని సైగ చేసింది.

వాడు ఉసూరుమంటూ రిక్షా తిప్పేసి వీధి చివరికి పోయాడు. తిరిగి ఎక్కడ తగలడతాడోనని గబగబ తలుపులు బిడాయించుకుంది.

ఓ నిమిషం గడిచిందో లేదో తలుపులు దబదబ బాది మరీ పిలిచాడు. తలుపుతీసి మరీ కసిరి పంపేసింది.

మరో పావు నిమిషం కల్లా ప్రత్యక్షం. చాచి లెంపకాయ కొట్టాలనిపించింది. ఆగ్రహోదగ్రురాలైన అమ్మవారిలాంటి రూపం చూసి రిక్షావాడు ఝడిసిపోయి వెనక్కి తిరుగుతుంటే వీధి చివర విఠలమూర్తి చరచర వచ్చి "ఏమ్మా! ఇతగాడ్ని ఎండలో మాడ్చటానికి కంకణం కట్టుకున్నావా? ఈ చీటీపట్టుకుని తిరుగుతుంటే మీ ఇల్లు చూపించాం" అన్నాడు.

"అవునమ్మా ఆ చీటీలో స్పష్టంగా "కొజ్జా కనకరాజుగారిల్లు" అని ఉన్నదాయె. మరీ మీది కానట్లుగా 'ఛీ' కొట్టి తగిలేస్తావేం?అని వెర్రెత్తిపోయాడో కుర్రాడు.

దాంతో కుక్కిన పేనుకి మారుపేరుగా మారాల్సి వచ్చింది గోమతికి. రిక్షాలోంచి డ్రామా ఆర్టికల్స్ అన్నింటినీ దింపి లోనికి తీసుకెళ్తుంటే వాటిని పెద్ద చెరువులో కలపాలనిపించింది.

వెళ్ళే ముందర వాడు బుర్ర గోక్కుంటూ నవ్వుతూ "అమ్మగోరూ తమరెవ్వరో తెల్సుకోనేదు... మొన్న బాబుగోరు... పైడితల్లమ్మ జాతర్లో నాటకవేసినారు గందా...!! దాన్లో యమాగా నప్పేసినారమ్మా! అచ్చం ఆడంగోడంటే ఆడంగోడే..." అని మెలికలు తిరిగిపోతూ రిక్షా తిప్పాడు.

ఒకసారి షాక్ కొట్టినట్లుండిపోయింది గోమతి.

ఓరోజు గోమతి టి.విలో సిన్మా చూస్తుంటే ఫోన్ వచ్చింది.

'ఏవిటి... విశాలాక్షి పిన్నిగారా! ఏమిటి సంగతులు...'

'టి.వి.తో యమబోరెత్తిపోతోంది... ఏదైనా థియేటర్‌కి వెళదామని ఉంది. మీరూ రెడీ కండి..." అని చెప్పి పెట్టేసింది.

కాలనీలో దాదాపు పదిమంది దాకా గుంపుగా బయలుదేరారు సినిమాకి. వాళ్ళు వెళ్ళేసరికి 'కల్పన' హాలు హౌస్‌ఫుల్ అయిపోయింది. ఇంటిముఖం పట్టడం ఇష్టం లేకపోయింది. అక్కడి నుండి 'వెంకటలక్ష్మి' థియేటర్‌కి చేరారు.

"అబ్బ చిల్లరకొట్టు చిట్టెమ్మ... పాత పిక్చరా... బోర్..." గునిసిందొకామె.

"అయితేనేం జయచిత్ర, మురళీమోహన్ కాంబినేషన్. దత్తుడిపాత్రలో మురళీమోహన్ నటన అద్భుతం..." అనేసి అందరికీ టిక్కెట్స్ తెచ్చింది జగదీశ్వరి.

సినిమా చూస్తున్నంతసేపూ ఒకటే విరగబడి నవ్వారు. కారణం 'మాడా' నటన...

చీకట్లో ఎవరికీ గోమతి మొహంలో భావాలు తెలీలేదు కాని, ఎంత దుఃఖపడిందో చెప్పలేం... అందరూ నవ్వుతూంటే తన భర్తను ఎద్దేవా చేస్తున్నట్లే ఉడుక్కుంది.

సినిమా విడిచారు.

"అబ్బ పాత్రకు జీవం పోశాడే మాడా..." అంది స్వరూప.

"అందుకే అతగాడికి ఆ పాత్రతోనే పేరొచ్చింది. ఈనాటిదాకా ప్రేక్షకుల గుండెల్లో ముద్రించుకుపోయాడు." చరిత అన్నది.

"ఆఁ చెప్పొచ్చారు...! మాడాకేం తక్కువ తిన్లేదు గోమతి భర్త..."

జగదీశ్వరి కల్పించుకుంది.

ఒక్కసారి గుండెల్లో రాయిపడ్డది గోమతికి.

ఏం 'మాడా' అంతటి మహానటుడా...? అతగాడు" అచ్చెరువొందింది అడిగింది వినోద.

"కాక... నిన్నగాక మొన్న 'పప్పులోకాలు' నాటికలో వేసిన 'కొజ్జా' పాత్ర ఎంతబాగా ఒప్పించాడని... దంచేశాడనుకో... అందుకే అతన్ని కొజ్జా కనకరాజుగా పిలుస్తున్నారు..." తెగ పొగిడింది జగదీశ్వరి.

"ఏవిఁటే? గోమతి భర్త వేసింది 'కొజ్జాపాత్రా'?? హ్హా హ్హా హ్హా..." అందరూ విరగబడి నవ్వారు.

తల తీసేసినట్లయింది గోమతికి.

భర్త కీర్తిమాట దేవుఁడెరుగు... ఆ పాత్ర పుణ్యమాని తను ఎకసెక్కాలకు, ఎగతాళిలకు గుర్తై అగాధాలలో కూరుకుపోతోంది... ఎంతవమానం. ఏం? నాటకాల్లో మరే పాత్రలూ లేవా? ఆ పాత్ర ఈయనకే ఇవ్వటంలో గల ఆంతర్యం... ఓహో! ఇదంతా దర్శకుడు దయానందం కుట్ర... ఇదివర్లో రెండుమూడు దఫాలు శ్రీవారు ఎద్దేమంటే తెడ్డేమన్నారని ఈ కుళ్ళు పాత్ర ఇచ్చి అణచాలనుకొన్నాడు. అతని మనసులోని మాయ తెలీని ఈ అమాయక చక్రవర్తి తేలిగ్గా ఒప్పేసుకుని బలైపోయారు.

ఛఛఛ!!! దయానందం కనిపిస్తే చాలు ఫిల్ట్ పట్టుకు గుంజాలి అనుకున్నది గోమతి.

ఇంక లాభం లేదు... ఈరోజు భర్తను ఎలాగయినా కడిగేయాలి. అలా అనుకున్న క్షణంలోనే కనకరాజు ఇంట్లో ప్రవేశించాడు.

గబగబ లోనికి వెళ్ళింది. కొవ్వొత్తి వెలిగించింది. అది పట్టుకుని... మీదమీదకు వస్తున్న భార్యను చూసి బెదిరిపోయాడు కనకరాజు.

దగ్గరగా వచ్చి నిల్చున్నది గోమతి.

"గోమతీ ఏమిటిది?"

"అగ్నిపరీక్ష... మీరీక్షణం నుండీ 'పప్పులో కాలు'లో ఆ 'పాత్ర' వేయనని ప్రమాణం చేస్తారా లేదా... ఊఁ"

"గోమతీ...!!"

"హుఁ మీకు కీర్తి తెచ్చి ఆ పాత్ర నాకు అపకీర్తి తెచ్చింది. మీరు అందరినీ నవ్వించిన ఆ 'పాత్రే' నన్ను నలుగురిలో నవ్వులపాలు చేసింది. మరింక భరించే సహనం కోల్పోయాను. ఊఁ ఈ దీపం మీద ఒట్టు వేయండి.."

"ప్లీజ్ గోమతీ! 'సాతులూరు' పరిషత్ నాటికల పోటీల్లో కామెడీ రోల్‌కి ప్రత్యేక బహుమతి పాతికవేలు ప్రకటించారు. ఎలాగైనా కొట్టేయాలని ప్లాన్ చేస్తున్నాను. అది చిక్కిన మరుక్షణం దానికి గుడ్‌బై కొట్టేస్తాను. ప్లీజ్..."

"అంటే మీరు బంపర్ బహుమతిని కూడా కొట్టేసి, ఆనక నా తలని కూడా ఇంకా అణగ దొక్కాలని చూస్తున్నారా!! నో... నోమోర్ ఛాన్స్..." బెదరగొట్టింది.

అయినప్పటికీ కనకరాజు ఒకటే మంకుపట్టు పట్టాడు.

మర్నాడుదయం వచ్చిన పేపర్లో న్యూస్ చదివి ఒకటే ఆనందపడిపో సాగింది. పదేపదే చదివింది గోమతి.

వీధిలోంచి బేలగావచ్చిన కనకరాజును చూసి ఒకటే విరగబడి నవ్వింది.

"నీకు ఎగతాళిగానే ఉంటుందిలే"

"ప్రసిద్ధ రచయిత పాపారావు కథ 'తప్పులతడక'కు 'పప్పులోకాలు' నాటిక మక్కీకి మక్కీ కాపీ అని, ప్రదర్శించటం చట్టరీత్యా నేరమని, ఇకపై ఎక్కడైనా, ఎవ్వరైనా ప్రదర్శించినా సరే, కోర్టు విధించే శిక్షకు పాత్రులగుదురు" అనీ విడివిడిగా పెద్ద గొంతుతో చదివింది గోమతి.

"మరోసారి ఆ వార్త చదివి గుండెల్లో దడ పుట్టించకు" డీలా పడ్డాడు కనకరాజు.

అనుకోకుండా తిరిగిన ఈ మలుపు గోమతి మనస్సును శాంతపరచింది. అయినప్పటికీ తన భర్తను "కొజ్జా కనకరాజు"గానే పిలవటం ఆమె చెవిని పడకపోలేదు.

ఏ నాటకంలో నయినా ఆడంగి పాత్ర అంటూ వుంటే ముందుగా ఆయా సమాజాల వారికి ఇప్పటికీ గుర్తుకొచ్చేది కనకరాజే!! ○